ఫైనల్లో ఆర్‌సీబీ

క్వాలిఫయర్-1లో పంజాబ్‌పై ఘన విజయం

సుయాశ్, హాజిల్‌వుడ్, సాల్ట్ విజృంభణ

తొమ్మిదేండ్ల తర్వాత తుది పోరుకు బెంగళూరు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ).. అదరగొట్టింది. తమ చిరకాల కలను సాకారం చేసుకునేందుకు మరో అడుగు ముందుకేసింది. లీగ్ దశ జోరును కీలకమైన ప్లేఆఫ్స్‌లో నూ కొనసాగిస్తూ క్వాలిఫయర్-1లో పంజాబ్ కింగ్స్‌ను మట్టికరిపించింది. వార్ వన్‌సైడ్ అన్నట్లు ఏకపక్షంగా సాగిన పోరులో ఆర్‌సీబీ సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ ఘన విజయంతో ఫైనల్లోకి దూసుకెళ్లింది. సుయాశ్‌శర్మ స్పిన్ తంత్రానికి తోడు హాజిల్‌వుడ్ నిఖార్సైన పేస్‌తో పంజాబ్ పేకమేడను తలపిస్తూ 101 పరుగులకే కూప్పకూలింది. సొంత ఇలాఖాలో సత్తాచాటుదామనుకున్న పంజాబ్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీసింది. స్వల్ప లక్ష్యఛేదనలో ఫిల్ సాల్ట్ సుడిగాలి ఇన్నింగ్స్‌తో 10 ఓవర్లలోనే ఘన విజయాన్ని ముద్దాడింది. ఈ క్రమంలో తొమ్మిదేండ్ల తర్వాత ఆర్‌సీబీ తుది పోరుకు అర్హత సాధించి 'ఈ సాలా కప్ నమదే' స్వప్నానికి సమీపంలో నిలిచింది.

సుయాశ్ (3/17)

ముల్లాన్‌పూర్: ఆర్‌సీబీ...ఐపీఎల్‌లో ఒక ఎమోషన్! ఈ సాలా కప్ నమదే అంటూ ప్రతీ సీజన్‌లో అభిమానుల భారీ అంచనాలు మోసే ఆర్‌సీబీ ఈసారి ఆ దిశగా ఒక్కో అడుగు ముందుకేస్తున్నది. లీగ్ దశలో ప్రత్యర్థులను పడగొడుతూ టాప్-2లో నిలిచిన ఆర్‌సీబీ అదే దూకుడుతో పంజాబ్ కింగ్స్‌ను చెడుగుడు ఆడుకుంది. గురువారం జరిగిన లో స్కోరింగ్ మ్యాచ్‌లో ఆర్‌సీబీ 8 వికెట్ల తేడాతో(10 ఓవర్లు మిగిలుండగానే) పంజాబ్‌పై చిరస్మరణీయ విజయం సాధించింది. 2016 తర్వాత తొలిసారి తుదిపోరులో నిలిచిన ఆర్‌సీబీ..క్వాలిఫయర్-2 విజేతతో ఫైనల్లో తలపడుతుంది. తొలుత సుయాశ్ శర్మ (3/17), హాజిల్‌వుడ్ (3/21) ధాటికి పంజాబ్ 14.1 ఓవర్లలో 101 పరుగులకు కుప్పకూలింది. ఆర్‌సీబీ బౌలింగ్ విజృంభణకు స్టాయినిస్(26) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. యశ్ దయాల్ (2/26) రెండు వికెట్లు తీశాడు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన బెంగళూరు 10 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేసింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్(27 బంతుల్లో 56 నాటౌట్, 6ఫోర్లు, 3సిక్స్‌లు) మెరుపు అర్ధసెంచరీతో జట్టు విజయంలో కీలకమయ్యాడు. కోహ్లీ(12), మయాంక్ అగర్వాల్(19), కెప్టెన్ రజత్ పాటిదార్(15 నాటౌట్) తలో చేయి వేశారు. తన స్పిన్ తంత్రంతో పంజాబ్ నడ్డివిరిచిన సుయాశ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

సంక్షిప్త స్కోర్లు

పంజాబ్: 14.1 ఓవర్లలో 101 ఆలౌట్(స్టాయినిస్ 26, ప్రభ్‌సిమ్రన్ 18, సుయాశ్ 3/17, హాజిల్‌వుడ్ 3/21),
బెంగళూరు: 10 ఓవర్లలో 106/2(సాల్ట్ 56 నాటౌట్, మయాంక్ 19, జెమీసన్ 1/27, ముషిర్ 1/27)

సుయాశ్ స్పిన్ ధమాకా:

టాస్ గెలిచిన ఆర్‌సీబీ..పంజాబ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. పిచ్ పరిస్థితులను సరిగ్గా అంచనా వేయని పంజాబ్ ఆదిలోనే మూల్యం చెల్లించుకుంది. ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌మీదున్న ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(7) వికెట్‌తో పంజాబ్ పతనానికి నాంది పడింది. యశ్ దయాల్ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లో కవర్స్‌లో షాట్ ఆడబోయిన ఆర్య..కృనాల్ పాండ్యా క్యాచ్‌తో తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఇక్కణ్నుంచి పంజాబ్ వరుసగా వికెట్లు కోల్పోయింది. భువనేశ్వర్ మూడో ఓవర్‌లో వరుసగా రెండు ఫోర్లతో దూకుడు మీద కనిపించిన ప్రభ్‌సిమ్రన్(18) అదే ఓవర్‌లో కీపర్ జితేశ్ క్యాచ్‌తో ఔటయ్యాడు. దీంతో పంజాబ్ 27 పరుగులకే ఓపెనర్లను కోల్పోయింది. ఆ తర్వాత కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(2)ను హాజిల్‌వుడ్ ఔట్ చేయడంతో పంజాబ్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆదుకుంటాడనుకున్న ఇంగ్లిస్(4) కూడా ఔట్ కావడంతో పవర్‌ప్లే ముగిసే సరికి పంజాబ్ 48 పరుగులకే 4 వికెట్లు చేజార్చుకుంది. స్టాయినిస్ ఒక్కడే భారీ షాట్లు ఆడుతూ జోరు కనబర్చగా, మిగతా బ్యాటర్లు పెవిలియన్ వెళ్లేందుకు పోటీపడ్డారు. బౌలింగ్ మార్పుగా వచ్చిన స్పిన్నర్ సుయాశ్ ఒకే ఓవర్లో శశాంక్‌సింగ్(3), ముషిర్‌ఖాన్(0)ను ఔట్ చేసి పంజాబ్‌ను ఘోరంగా దెబ్బకొట్టాడు. ఓ ఎండ్‌లో స్టాయినిస్‌కు సహకరించే వారు కరువయ్యారు. అయితే సుయాశ్ బంతిని సరిగ్గా అర్థం చేసుకోని స్టాయినిస్ ఔట్ కావడంతో పంజాబ్ ఇన్నింగ్స్‌కు ఫుల్‌స్టాప్ పడింది.

సాల్ట్ (56*)

సాల్ట్ మెరుపులు:

స్వల్ప లక్ష్యఛేదనలో ఆర్‌సీబీ అదరగొట్టింది. మంచి ఫామ్‌మీదున్న సాల్ట్..బౌలర్ ఎవరన్నది లెక్కచేయకుండా బ్యాటు ఝుళిపించాడు. జెమీసన్ బౌలింగ్‌లో కోహ్లీ ఔటైనా సాల్ట్ తన జోరు తగ్గించలేదు. ఈ క్రమంలో బౌండరీలతో చెలరేగిన సాల్ట్ 23 బంతుల్లోనే అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. ఐపీఎల్‌లో సాల్ట్‌కు ఇది వేగవంతమైన అర్ధసెంచరీ. మయాంక్(19) ఉన్నంతసేపు సాల్ట్‌కు సహకరించాడు. మయాంక్ ఔట్ తర్వాత వచ్చిన పాటిదార్..ముషిర్ బౌలింగ్‌లో సిక్స్‌తో గెలుపు లాంఛనాన్ని పూర్తి చేశాడు.

భారత్ పసిడి జోరు

జ్యోతి, అవినాశ్, 4X400 టీమ్‌కు స్వర్ణాలు ● ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్



గుమి(దక్షిణ కొరియా): ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్లు పసిడి పతకాలతో అదరగొట్టారు. తెలుగు యువ అథ్లెట్ జ్యోతి యర్రాజీ, అవినాశ్ సాబ్లేతో పాటు మహిళల 4X400 మీటర్ల రిలే టీమ్‌లో భారత్ స్వర్ణ పతకాలతో మెరిసింది. గురువారం జరిగిన మహిళల 100మీటర్ల హర్డిల్స్ రేసును జ్యోతి 12.96 సెకన్ల టైమింగ్‌తో పసిడి పతకాన్ని ఒడిసిపట్టుకుంది. ట్రాక్‌పై చిరుతను తలపిస్తూ జ్యోతి అగ్రస్థానంలో నిలిచింది. యుమి తనకా(జపాన్), వు యన్ని(చైనా) వరుసగా రజత, కాంస్య పతకాలు ఖాతాలో వేసుకున్నారు. పురుషుల 3000మీటర్ల స్టిపుల్‌చేజ్‌లో స్టార్ స్ప్రింటర్ అవినాశ్ ము కుండ్ సాబ్లె 8:20:92సెకన్ల టైమింగ్‌తో స్వర్ణం దక్కించుకున్నాడు. మహిళల 4X400 మీటర్ల రిలే రేసులో జిస్నా మాథ్యూస్, రూపాల్ చౌదరి, కుంజ రజిత, శుభా వెంకటేశన్‌తో కూడిన భారత జట్టు రేసును 3:34:18 సెకన్లలో పూర్తి చేసి పసిడి కైవసం చేసుకుంది. ఓవరాల్‌గా భారత్‌కు 10వ స్వర్ణం కాగా, లీగ్‌లో ఇప్పటి వరకు భారత్‌కు మూడు స్వర్ణాలు, రెండు రజతాలు, ఒక కాంస్యంతో దూసుకెళుతున్నది.

క్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ

సింగపూర్: సింగపూర్ ఓపెన్‌లో భారత స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్స్ పోరులో సాత్విక్, చిరాగ్ ద్వయం 19-21, 21-16, 21-19తో ఏడోసీడ్ సాబర్ కర్యమన్, రెజా పాహ్లెవి(ఇండోనేషియా)పై అద్భుత విజయం సాధించింది. గంటా 14 నిమిషాల పాటు సాగిన పోరులో తొలి గేమ్‌ను చేజార్చుకున్న సాత్విక్, చిరాగ్ పుంజుకుని పోటీలోకి వచ్చారు. కండ్లు చెదిరే స్మాష్‌లకు తోడు నెట్‌గేమ్‌తో ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించిన మన జోడీ వరుస గేముల్లో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. మరో సింగిల్స్‌లో ప్రణయ్ 16-21, 14-21తో పొపోవ్(ఫ్రాన్స్) చేతిలో ఓడాడు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో పీవీ సింధు 9-21, 21-18, 16-21తో చెన్ యుఫీ(చైనా) చేతిలో ఓడి నిష్క్రమించింది. మహిళల డబుల్స్‌లో త్రిసా జాలీ, గాయత్రి గోపీచంద్ ద్వయంతో పాటు మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్‌కపూర్, రుత్వికా శివానీ జంట పోరాటం ముగిసింది.

అకీరా నందన్ అదుర్స్

వరల్డ్ పారా అథ్లెటిక్స్‌లో మెరిసిన కండక్టర్ కొడుకు

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): మొరాకో వేదికగా జరిగిన ప్రతిష్టాత్మక ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్‌ప్రి టోర్నీలో తెలంగాణకు చెందిన బానోతు ఆకీరా నందన్ అదరగొట్టాడు. 400మీటర్ల రేసును 53.07 సెకన్లలో పూర్తి చేసిన అకీరా పసిడి పతకంతో మెరిశాడు. అదే జోరు కొనసాగిస్తూ 200మీటర్ల పరుగు పందెంలోనూ కాంస్యాన్ని ఖాతాలో వేసుకున్నాడు. హైదరాబాద్ కూకట్‌పల్లి డిపోనకు చెందిన కండక్టర్ బానోతు మోహన్ కొడుకు అకీరా నందన్‌ను టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ గురువారం అభినందించారు. క్రీడల్లో రాణించేలా అకీరాను ప్రోత్సహిస్తున్న మోహన్ దంపతులను ఆయన ప్రశంసించారు. భవిష్యత్‌లో మరింత మెరుగ్గా రాణించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీలు మునిశేఖర్, వెంకన్న, శ్రీధర్, సీపీఎం ఉషాదేవి, డీఎం హరి పాల్గొన్నారు.

గుజరాత్ X ముంబై

నేడు ఐపీఎల్ ఎలిమినేటర్ మ్యాచ్

ముల్లాన్‌పూర్: ఐపీఎల్‌లో మరో కీలక పోరుకు రంగం సిద్ధమైంది. శుక్రవారం ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరుగనుంది. లీగ్ దశలో మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన ఈ రెండు జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఒకానొక దశలో అగ్రస్థానంలో నిలుస్తుందనుకున్న గుజరాత్ ఆఖర్లో వరుస మ్యాచ్‌ల్లో ఓటములతో మూడో స్థానానికి పరిమితమైంది. మరోవైపు లీగ్ ప్రారంభంలో వరుస ఓటములతో ఈసారి నిరాశపరుస్తుందా అనుకున్న ఐదు సార్లు చాంపియన్ ముంబై అద్భుతంగా పుంజుకుంది. అయితే ఇరు జట్లలో కీలక ప్లేయర్లు వైదొలగడంతో తుది జట్ల కూరుపై ఆసక్తి నెలకొన్నది. ముఖ్యంగా గుజరాత్ బ్యాటింగ్‌కు వెన్నెముకలా నిలిచిన ఇంగ్లండ్ హార్డ్‌హిట్టర్ జోస్ బట్లర్ లేని లోటును భర్తీ చేయడం కష్టంగా కనిపిస్తున్నది. పటిష్ట బౌలింగ్ లైనప్ ఉన్న ముంబైని ఎదుర్కొవడం గుజరాత్‌కు కష్టమే. గిల్, సుదర్శన్‌లో ఏ ఒక్కరూ విఫలమైనా గుజరాత్ కుప్పకూలడం ఖాయం. రికార్డు స్థాయిలో ఆరో టైటిల్‌పై కన్నేసిన ముంబై..గుజరాత్‌ను నాకౌట్ చేసి ముందంజ వేయాలని చూస్తున్నది. జాతీయ జట్ల తరపున ఆడేందుకు ఇప్పటికే రికల్టన్, విల్ జాక్స్ ఇంగ్లండ్‌కు బయల్దేరి వెళ్లగా వారి స్థానాలను బెయిర్‌స్టో, రిచర్డ్ గ్లిసన్, చరిత అసలంక ఏ మేరకు భర్తీ చేస్తారో చూడాలి.

ఫైనల్లో అమన్, అన్ముల్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్‌లో భారత బాక్సర్లు నమన్ తన్వర్, అన్ముల్ గిల్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన పురుషుల 90కిలోల సెమీస్ బౌట్‌లో నమన్ 4-1తో జురబోవ్ ఎలోర్‌బెక్(ఉజ్బెకిస్థాన్)పై అద్భుత విజయం సాధించాడు. 90+కిలోల సెమీస్ పోరులో అన్ముల్ 3-2తో రుస్తమోవ్ అబ్దుర్‌మకోవ్‌పై గెలిచాడు. హోరాహోరీగా సాగిన ఈ రెండు బౌట్లలో తొలుత భారత బాక్సర్లు నమన్, అన్ముల్ తడబడ్డా..ఆ తర్వాత ప్రత్యర్థిపై స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శిస్తూ బౌట్లను తమ వశం చేసుకున్నారు. మరోవైపు మహిళల విభాగంలో తమన్నా(51కి), ప్రియ(57కి), లాల్‌ఫక్వామాయి(80కి) ప్రత్యర్థుల చేతిలో ఓడి కాంస్య పతకాలతో సంతృప్తి పడ్డారు.

సన్నాహానికి సై

● **నేటి నుంచి భారత్ 'ఏ', ఇంగ్లండ్ లయన్స్ పోరు**

కాంటర్‌బురీ(ఇంగ్లండ్): ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు సన్నాహకంగా భారత్ 'ఏ' బరిలోకి దిగబోతున్నది. శుక్రవారం నుంచి ఇంగ్లండ్ లయన్స్‌తో తొలి నాలుగు రోజుల అనధికారిక టెస్టు మ్యాచ్ ఆడబోతున్నది. అభిమన్యు ఈశ్వరన్ నాయకత్వంలో మ్యాచ్ ఆడబోతున్న భారత్ 'ఏ' తరపున ధృవ్ జురెల్, కరణ్‌నాయర్, ఆకాశ్‌దీప్, శార్దుల్ ఠాకూర్ లాంటి క్రికెటర్లు ఉన్నారు.

గాఫ్ ముందంజ

● **ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్**

పారిస్: ప్రతిష్టాత్మక ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో అమెరికా యువ సంచలనం కొకో గాఫ్ ముందంజ వేసింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్ పోరులో రెండో సీడ్ గాఫ్ 6-2, 6-4తో వాలెన్‌టోవాపై అలవోక విజయం సాధించింది. ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించిన గాఫ్..ప్రత్యర్థిని వరుస సెట్లలో చిత్తు చేసింది. మ్యాచ్‌లో రెండు ఏస్‌లు సంధించిన గాఫ్ 13 బ్రేక్‌పాయింట్లలో ఎనిమిదింటిని కాపాడుకుంది. మరోవైపు మిగతా మ్యాచ్‌ల్లో మాడిసన్ కీస్ 6-1, 6-3తో బౌల్టర్‌పై గెలిచారు.

వైద్యం టీజీలో.. రిజిస్ట్రేషన్ ఏపీలో..

- **తెలంగాణ డెంటల్ కౌన్సిల్ ఉన్నా ఏపీలోనే కొనసాగుతున్న 13 వేల రిజిస్ట్రేషన్లు**
- **రెన్యువల్ సొమ్మంతా ఏపీడీసీ ఖాతాలోనే జమ**



హైదరాబాద్ సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణలో ప్రాక్టీస్.. ఏపీలో రిజిస్ట్రేషన్' అన్నట్టుగా తయారైంది దంత వైద్యుల పరిస్థితి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా తెలంగాణ డెంటిస్టుల రిజిస్ట్రేషన్లు ఏపీ డెంటల్ కౌన్సిల్ (ఏపీడీసీ) లోనే కొనసాగుతున్నాయి. తెలంగాణలో ప్రాక్టీస్ చేస్తున్న డెంటిస్టులు ఏటా తమ రిజిస్ట్రేషన్లను ఏపీడీసీలోనే రెన్యువల్ చేయించుకుంటున్నారు. దీంతో తెలంగాణ డెంటల్ కౌన్సిల్‌కు రావాల్సిన ఆదాయం ఏపీకి వెళ్లిపోతున్నది. దంత వైద్యుల రిజిస్ట్రేషన్లను 2014 వరకు ఉమ్మడి రాష్ట్రానికి చెందిన ఏపీడీసీలో నమోదుచేసేవారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఏపీడీసీరెండుగా విడిపోయింది. 2014లో తెలంగాణ డెంటల్ కౌన్సిల్ ఏర్పాటైంది. అప్పటి నుంచి ఇప్పటివరకు తెలంగాణ డెంటల్ కౌన్సిల్‌లో 11,000 మంది దంత వైద్యులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అయితే, ఉమ్మడి రాష్ట్రంలో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నవారంతా నేటికీ ఏపీడీసీపరిధిలోనే రిజిస్ట్రేషన్లు కలిగి ఉన్నారు. రాష్ట్రం ఏర్పడి 11 ఏండ్లు గడుస్తున్నా తెలంగాణకు చెందిన 13,000 మంది డెంటిస్టులు తమ రిజిస్ట్రేషన్‌ను తెలంగాణకు బదిలీ చేయించుకోలేదు. వీరంతా ఏపీ డెంటల్ కౌన్సిల్‌లో కొనసాగుతూ తెలంగాణలో వైద్యం చేస్తున్న పరిస్థితి కనిపిస్తున్నది. డెంటిస్ట్ యాక్ట్-1948 ప్రకారం దంత వైద్యులు ఏ రాష్ట్రంలో ప్రాక్టీస్ చేస్తున్నారో.. అదే రాష్ట్రంలో ఉన్న డెంటల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ అయి ఉండాలి. ఈ లెక్కన తెలంగాణలో ప్రాక్టిస్ చేస్తున్న 13,000 మంది డెంటిస్టులు తమ రిజిస్ట్రేషన్లను ఏపీ నుంచి తెలంగాణ డెంటల్ కౌన్సిల్‌కు మార్చుకోవాల్సి ఉన్నది. కానీ, వారు ఏపీ డెంటల్ కౌన్సిల్‌లోనే కొనసాగుతున్నందున ఏటా రెన్యువల్ ప్రక్రియ ద్వారా తెలంగాణ డెంటల్ కౌన్సిల్‌కు రావాల్సిన ఆదాయం ఏపీకి వెళ్తున్నది. దీనికి తోడు భవిష్యత్‌లో వైద్య శాఖ అధికారులు జరిపే తనిఖీల్లో ఏపీ రిజిస్ట్రేషన్లు కలిగి తెలంగాణలో ప్రాక్టిస్ చేస్తే వారి మీద చర్యలు తీసుకునేందుకు ఆస్కారం కూడా ఉన్నది. రిజిస్ట్రేషన్ల బదిలీలు జరిపేందుకు ఉపయోగపడే సింగిల్ విండో సిస్టమ్ ప్రస్తుతం తెలంగాణలో అమల్లో లేదు. వెంటనే దాన్ని అమలు చేసి ఉమ్మడి రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ కలిగిన తెలంగాణ డెంటిస్టులను తెలంగాణ డెంటల్ కౌన్సిల్‌కు బదిలీ చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

సింగిల్ విండో సిస్టం అమలు చేయాలి

రాష్ట్రం విడిపోయిన తరువాత చాలా మంది దంత వైద్యులు ఏపీ డెంటల్ కౌన్సిల్‌కు చెందిన డెంటల్ రిజిస్ట్రేషన్‌తోనే కొనసాగుతూ, తెలంగాణలో పనిచేస్తున్నారు. వీరి బదిలీకి సమయ పాలనతో కూడిన సింగిల్ విండో సిస్టంను అమలుచేయాలి. మన డెంటిస్టుల రెన్యువల్ సొమ్ము మన రాష్ట్ర డెంటల్ కౌన్సిలే తీసుకోవాలి.
-ఎండీ మంజూర్ అహ్మద్, ఏఐడీఎస్ఏ అధ్యక్షుడు

వన మహోత్సవంపై.. నిరుత్సాహం!

మొక్కలు నాటే లక్ష్యాన్ని తగ్గిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

నిరుడు 20 కోట్లు, ఈ ఏడాది 18 కోట్లకే పరిమితం

వచ్చే ఏడాది 16 కోట్ల మొక్కలే

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ ప్రవేశ పెట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని నీరుగారుస్తున్నది. హరిత హారం పేరును వనమహోత్సవంగా మార్చిన ప్రభుత్వం ప్రతి ఏటా నాటే మొక్కల సంఖ్యను క్రమంగా తగ్గిస్తూ వస్తున్నది. కేసీఆర్ హయాంలో ప్రతి ఏడాది సగటున 30 కోట్ల వరకు మొక్కలు నాటితే.. కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ఏడాది 20 కోట్ల మొక్కలను లక్ష్యంగా పెట్టుకున్నది. లక్ష్యంలో 90 శాతం మాత్రమే మొక్కలు నాటిన ప్రభుత్వం ఈ ఏడాది కేవలం 18 కోట్ల మొక్కలను మాత్రమే నాటుతామని ప్రకటించింది. జూన్‌లో మొదటి వారంలో ప్రారంభం కానున్న 'వనమహోత్సవం' కార్యక్రమంలో 18 కోట్ల మొక్కలను నాటే ప్రయత్నం చేస్తున్నామని, వచ్చే ఏడాది లక్ష్యాన్ని 16 కోట్ల మొక్కలకు పరిమితం చేసే అవకాశాలు ఉన్నాయని అటవీశాఖ ఉన్నతాధికారి డాక్టర్ సువర్ణ తెలిపారు.

ఇంటర్‌లో ఇష్టారీతిన ఆన్‌డ్యూటీలు!

- **కరీంనగర్‌లో పోస్ట్.. ములుగులో ఓడీ**
- **రెండింటి మధ్య 200 కిలోమీటర్లు**
- **జీతాలు ఓ చోట.. క్లాస్‌లు మరోచోట**
- **కొత్త జేఎల్స్‌కు శాపంగా ఆన్‌డ్యూటీ**
- **ఆందోళనలో జూనియర్ అధ్యాపకులు**

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): ఎక్కడి ఖమ్మం.. ఎక్కడి కందుకూరు(రంగారెడ్డి జిల్లా) వీటి మధ్య దూరం దాదాపు 250 కిలోమీటర్లు. ఎక్కడి కరీంనగర్ ఎక్కడి వెంకటాపురం(ములుగు) వీటి మధ్య దూరం 200 కిలోమీటర్లు. పోస్టింగేమో ఖమ్మం, కరీంనగర్.. పని చేయాల్సిందేమో కందుకూరు, ములుగు వెంకటాపురంలో. ఇది ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో కొత్తగా నియమితులైన లెక్చరర్ల పరిస్థితి. ఇంటర్ విద్యలో లెక్చరర్లను ఇష్టారీతిన ఆన్‌డ్యూటీ(ఓడీ)పై కేటాయించారు. దగ్గరా.. దూరం అని చూడకుండా కేటాయించారు. దీంతో వీరి అవస్థలు వర్ణణాతీతంగా మారాయి. ఇలాంటి వారు 300 మంది వరకు ఉంటారని బాధితులు వాపోతున్నారు.

పోస్టింగ్ ఓ చోట.. డిప్యూటేషన్ మరోచోట

రాష్ట్రంలో జేఎల్ నోటిఫికేషన్ 14 ఏండ్ల తర్వాత విడుదలైంది. కేసీఆర్ సర్కారు ఇంటర్ విద్య చరిత్రలో ఒకేసారి 1,392 పోస్టుల భర్తీ కోసం 2022 డిసెంబర్ 9న నోటిఫికేషన్ జారీచేసింది. 2023 సెప్టెంబర్ 12 నుంచి అక్టోబర్ 3 వరకు పరీక్షలు నిర్వహించారు. 2024 ఆగస్టు 5 నుంచి సెప్టెంబర్ 11 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరిపారు. 100 పోస్టులు బ్యాక్‌లాగ్ అయ్యాయి. 1,292 కొత్త అధ్యాపకులకు కౌన్సెలింగ్ నిర్వహించి మార్చి 12న అపాయింట్‌మెంట్ ఇచ్చారు. ఈ అపాయింట్‌మెంట్స్ ఇచ్చే సమయంలోనే కొందరు లెక్చరర్లను ఆన్‌డ్యూటీపై ఇతర కాలేజీలకు కేటాయించారు. దీంతో ఆన్‌డ్యూటీ కేటాయించిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యింది. జీతాలు తీసుకునేది ఓచోట.. క్లాసులు చెప్పేది మరోచోట అన్నట్టుగా మారింది. కొందరు మార్చి 13న కాలేజీల్లో ప్రిన్సిపాళ్లకు రిపోర్ట్‌చేయగానే.. సదరు అధ్యాపకులను ఆన్‌డ్యూటీ కేటాయించిన కాలేజీలకు పంపాలని ఆదేశించారు. మరికొందరినేమో జూన్ 2 నుంచి కాలేజీలు పునఃప్రారంభమమయ్యే సమయంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. దీంతో బాధితులంతా గగ్గోలు పెడుతున్నారు.

ఉదాహరణలివిగో..

- ఓ జువాలజీ లెక్చరర్‌కు తొలుత ఆలియా కాలేజీ (హైదరాబాద్)లో పోస్టింగ్ ఇచ్చారు. ఏమయ్యిందో ఏమో అక్కడి నుంచి వికారాబాద్ జిల్లాలోని జూనియర్ కాలేజీకి పంపించారు. బొల్లారంలో పోస్టింగ్ ఇచ్చిన మరో లెక్చరర్‌ను నల్లగొండ జిల్లా కనగల్ కాలేజీలో ఇష్టారీతిన ఆన్‌డ్యూటీపై వేశారు.
- **సిద్దిపేట జిల్లా మద్దూరు కాలేజీలో పని చేస్తున్న చరిత్ర అధ్యాపకుడిని ఆదిలాబాద్ కాలేజీకి, కరీంనగర్ కాలేజీలో పనిచేస్తున్న మరో చరిత్ర అధ్యాపకుడిని ములుగు కాలేజీకి కేటాయించారు.**
- సివిక్స్ లెక్చరర్ ఒకరికి తొలుత కరీంనగర్ జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. ఆ తర్వాత మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి, ఖమ్మం జిల్లాకు చెందిన మరో లెక్చరర్‌ను కందుకూరుకు బదిలీచేశారు.
- **నిజామాబాద్ జిల్లాకు చెందిన మహిళ లెక్చరర్‌ను బూర్గంపాడు కాలేజీలో పని చేయాలని సూచించారు.**
- హనుమకొండలో పనిచేస్తున్న కెమిస్ట్రీ లెక్చరర్‌ను కందుకూరు, నిర్మల్‌లో పని చేస్తున్న మరో కెమిస్ట్రీ లెక్చరర్‌ను తాండూరుకు వేశారు.
- **జువాలజీ లెక్చరర్ ఒకరికి కరీంనగర్‌లో పోస్టింగ్ ఇవ్వగా భూపాలపల్లి కాలేజీకి, సిద్దిపేట నుంచి ఓ లెక్చరర్‌ను కామారెడ్డికి ఆన్‌డ్యూటీపై వేశారు.**
- ఇంగ్లిష్ లెక్చరర్‌కు తొలుత జడ్చర్లలో పోస్టింగ్ ఇవ్వగా, తాజాగా వికారాబాద్ జిల్లా బోంరాస్‌పేటకు, నారాయణపేట కాలేజీలోని అధ్యాపకుడిని బషీరాబాద్‌కు పంపించారు.
- **హనుకొండ కాలేజీలో పోస్టింగ్ ఇచ్చిన తెలుగు లెక్చరర్‌ను ఖమ్మం జిల్లా కూసుమంచికి, హనుమకొండ జిల్లాలోని మరో తెలుగు లెక్చరర్‌ను వెంకటాపురం-ములుగుకు ఆన్‌డ్యూటీపై పంపించారు.**
- సికింద్రాబాద్ ఎస్సీరోడ్‌లోని కాలేజీలో కామర్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న అధ్యాపకుడిని వికారాబాద్ జిల్లా హకీంపేటకు, సితాఫల్‌మండీలో పనిచేస్తున్న మరో కామర్స్ అధ్యాపకుడిని బోంరాస్‌పేటకు వేశారు.
- హైదరాబాద్ బోరబండ కాలేజీలో పోస్టింగ్ ఇచ్చిన హిందీ లెక్చరర్‌ను జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ కాలేజీకి కేటాయించారు. మాగనూరు కాలేజీలోని హిందీ లెక్చరర్‌ను మహమ్మదాబాద్‌లో ఆన్‌డ్యూటీపై వేశారు.

సెక్యూరిటీ డ్రిల్స్ 31కి వాయిదా

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌తో సరిహద్దు గల జిల్లాల్లో ఈ నెల 31న సాయంత్రం భద్రతా దళాలు సెక్యూరిటీ డ్రిల్స్ నిర్వహిస్తాయి. గుజరాత్, పంజాబ్, హర్యానా, రాజస్థాన్, జమ్ముకశ్మీరులలో